సాక్షి
కుమురం భీమ్

‘చిటి’కిపోతున్న ‘కౌలు’



సాగు కలిసిరాక కౌలు రైతు బలిపీఠమెక్కు తున్నారు. సంక్షేమ పథకాలు అందక.. ఏటా ప్రకృతి వైపరీత్యాలతో అప్పు తీర్చే దారి లేక ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. 8లో▸



లంబోదరుడికి ఘనంగా పూజలు

గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసా గుతున్నాయి. సోమవారం మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.5/24.2

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తుపాను ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ వెంకటరమణ



డీఎస్పీ వెంకటరమణ

ఆసిఫాబాద్‌: కరీంనగర్ పీటీసీ నుంచి ఆసిఫాబాద్ డీఎస్పీగా బదిలీపై వచ్చిన మొట్ల వెంకటరమణ సోమవారం జిల్లా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. మొట్ల లక్ష్మి, కొమురయ్య దంపతుల కుమారుడైన వెంకటరమణ వరంగల్ జిల్లా నర్సంపేటలో 1967లో జన్మించారు. ఇంటర్ వరకు నర్సంపేట ప్రభుత్వ కళాశాలలో, హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచి క్రీడల్లో చురుకుగా పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. 1991లో ఎస్సైగా ఉద్యోగం సాధించారు. 2008లో సీఐగా, 2017లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటరమణ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు సమస్యలపై నేరుగా తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అనంతరం అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న టెక్నికల్ సిబ్బంది సోమవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, డీపీవో సురేందర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ టెక్నికల్ వ్యవస్థలోని 33 మంది జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, పంచాయతీల్లో పనిచేస్తున్న 119 మంది ఈ– పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. ఒక్కో కంప్యూటర్ ఆపరేటర్ 8 నుంచి 10 పంచాయతీల పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని, ఉద్యోగులకు ఆరోగ్య బీమా, మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు సతీశ్, రాజు, రమేశ్ తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్లకు పింఛన్ అందించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇస్తున్న విధంగానే మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లకు రూ.10వేల పింఛన్ అందించాలని రాష్ట్ర పురపాలిక కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ బుక్యా రామునాయక్, జిల్లా చైర్మన్ జయచందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లతో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో మేయర్లు, చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల కోసం నూతన గెస్ట్‌హౌజ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లకు రూ.లక్ష, కౌన్సిల్ సభ్యులకు రూ.25వేల గౌరవ వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులు అందించాలని కోరారు. స్లమ్ ఏరియాల అభివృద్ధికి వార్డుల వారీగా రూ.50 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివప్రసాద్, రాజేందర్, సునీల్, శివకుమార్, యాస్మిన్ బాను, నసీం బాను తదితరులు ఉన్నారు.

అంతటా నకిలీ.. తనిఖీలు గాలికి!



- ఆసిఫాబాద్‌కు చెందిన రాజేష్ మూడు రోజుల కిందట గుండి రహదారిలో ఉన్న ఓ మద్యం దుకాణానికి వెళ్లి క్వార్టర్ మద్యం తీసుకున్నాడు. ఇంటికెళ్లి బాటిల్ మూత తీయగానే స్పిరిట్ వాసన గుప్పుమంది. తాజాగా తయారైన మద్యం అనుకుని గ్లాసులో పోసుకుని తాగగా.. నిజంగా స్పిరిట్ తాగిన భావన. నిత్యం తాగే బ్రాండ్ ఇలా ఉందేమని.. మరుసటి రోజు బ్రాందీ షాపుకెళ్లి ఫిర్యాదు చేశాడు. సాయంత్రానికి షాపు లైసెన్సుదారుడు రాజేష్‌కి ఫోన్ చేసి ‘ఏ బ్రాండు తీసుకున్నావు? స్పిరిట్ వాసన వచ్చిందా? నేను చెక్ చేస్తాను.. ఎవరితో చెప్పకు’ అని కోరాడు.
- శ్రీధర్ అనే మరో వ్యక్తి రెండు రోజుల కిందట ఖరీదైన విస్కీ బ్రాండు మద్యం బాటిళ్లు కొనుగోలు చేశాడు. స్నేహితులతో కలిసి పార్టీలో మద్యం బాటిళ్లను ఓపెన్ చేసి గ్లాసుల్లో పెగ్‌లు పోయగా.. వాటిని తాగిన స్నేహితులందరూ ఇది నకిలీ మద్యం.. స్పిరిట్ వాసన వస్తోందని అనడంతో శ్రీధర్ కంగుతిన్నాడు. ఆసిఫాబాద్‌లోని చిర్రకుంట వెళ్లే రహదారిలో ఉన్న ఓ మద్యం దుకాణంలో శ్రీధర్ ఈ బాటిళ్లను కొనుగోలు చేసినట్లు తెలిసింది.

ఇలా.. జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా నకిలీ మద్యం బాటిళ్లను మద్యం షాపుల్లో విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం తనిఖీలకు దూరంగా ఉంటున్నారు.

- జిల్లాలో జోరుగా నకిలీ మద్యం దందా
- విచ్చలవిడిగా వైన్స్‌ల్లోనే విక్రయం
- మద్యం స్థానంలో స్పిరిట్ కలుపుతున్న వైనం
- రోగాల బారిన పడుతున్న మందుబాబులు
- పట్టించుకోని ఆబ్కారీశాఖ

సాక్షి, ఆసిఫాబాద్‌: జిల్లాలో నకిలీ మద్యం ఏరులై పారుతోంది. జిల్లావ్యాప్తంగా ఈ రకం మద్యం విక్రయించని వైన్స్ లేదంటే అతిశయోక్తి కాదు. నిబంధనలకు విరుద్ధంగా అనేక మద్యం షాపుల్లోనూ లభిస్తోంది. నవంబర్ తర్వాత పాత వైన్స్ షాపుల స్థానంలో కొత్తవి రానుండడంతో పాత షాపుల యజమానులు కొందరు నకిలీ మద్యం దందాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పోలీసు ఉన్నతాధికారులు, ఆబ్కారీ ఉన్నతాధికారులకు మామూళ్లు ఇస్తున్నామనే భావనతో.. చివరి రోజుల్లోనైనా కొంత లాభాలు దక్కించుకునేందుకు లైసెన్సుదారులు నకిలీ మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం. దీనిని అరికట్టాల్సిన సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో తనిఖీలు గాలికొదిలేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాగజ్‌నగర్ అడ్డాగా..

జిల్లాలో 32 మద్యం దుకాణాలు, 3 బార్లు ఉన్నాయి. ఏటా రూ.250 కోట్ల మద్యం అమ్ముడవుతోంది. వీటికి అనుసంధానంగా మండల కేంద్రాల్లో పదుల సంఖ్యలో బెల్టు షాపులు ఉండగా.. జిల్లావ్యాప్తంగా వాటి సంఖ్య 800 వరకు ఉంటుంది. నవంబర్‌తో ప్రస్తుత మద్యం షాపులకు గడువు పూర్తవుతోంది. డిసెంబర్ నుంచి కొత్తగా మద్యం దుకాణాలను టెండర్ల ద్వారా దక్కించుకున్న లైసెన్సుదారులు ఏర్పాటు చేయనున్నారు. ఇదే అదనుగా ప్రస్తుతం ఉన్న లైసెన్సుదారులు తమ మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం విక్రయాలకు తెరలేపినట్లు సమాచారం. ముఖ్యంగా కాగజ్‌నగర్ అడ్డాగా నకిలీ మద్యం తయారవుతోంది. అసలు బాటిళ్ల మాదిరిగా ఉండే నకిలీ బ్రాండ్లను షాపుల్లో ఉంచి మందుబాబులకు అంటగడుతూ రూ.లక్షలు అర్జిస్తున్నారు. ఒకప్పుడు చీప్ లిక్కర్లలో కల్తీ జరిగేది. కానీ ప్రస్తుతం ఖరీదైన బ్రాండ్లనూ నకిలీగా తయారు చేయడం విశేషం.

ఇదే విషయమై జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి జ్యోతికిరణ్‌ను వివరణ కోరేందుకు ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

జోరుగా దందా..

ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల నిర్వహణ గడువు ఈ ఏడాది నవంబర్ నెలాఖరుతో ముగియనుంది. ఇటీవలే కొత్త దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించిన విషయం తెలిసిందే. ఇదే తరుణంలో ప్రస్తుతం ఉన్న మద్యం లైసెన్సుదారులు అక్రమార్జనకు అడ్డదారులు వెతుక్కున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు బీరు, ఇతర ప్రీమియం మద్యం బాటిళ్లపై ధర పెంచి విక్రయించి సొమ్ము చేసుకున్న సంగతి విధితమే. ఇప్పుడంతకు మించి అర్జించాలంటే నకిలీ మద్యం ఒక్కటే మార్గమని భావించి అసలు బ్రాండ్ల స్థానంలో నకిలీ మద్యం బ్రాండ్ బాటిళ్లను ఉంచి విక్రయిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో కేవలం కొన్ని దుకాణాల్లో మాత్రం నకిలీ మద్యం విక్రయాలు జరగడం లేదని తెలుస్తోంది. స్థానికుల్లో చాలా మంది మంచిర్యాల, పొరుగున ఉన్న మహారాష్ట్రకు వెళ్లి మద్యం బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారంటే జిల్లాలో నకిలీ మద్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. చాటుగా కాకుండా ఏకంగా మద్యం దుకాణాల్లోనే నకిలీ మద్యం బాటిళ్లను ఉంచి విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదు.

దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: నూతన ఓటరు నమోదు, జాబితా సవరణలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవోలు రాజేశ్వర్, సురేశ్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్–2023లో నూతన ఓటరు నమోదు, సవరణల కోసం ఫారం 6, 7, 8ల ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి జాబితాలో తప్పులు లేకుండా జాబితా తయారీకి బూత్‌స్థాయి అధికారులతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఓటరు జాబితాపై ప్రతీ సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లను ఓటరు జాబితాలో ప్రత్యేకంగా మార్కింగ్ ద్వారా గుర్తిస్తున్నామని అన్నారు.

ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న ఆశవర్కర్లు

ఆసిఫాబాద్‌అర్బన్‌: రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో ఏళ్లుగా సేవలందిస్తున్న ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 28వేల మంది ఆశవర్కర్లు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంకితభావంతో సేవలందిస్తున్నారని తెలిపారు. కీలకమైన విధులు నిర్వర్తిస్తున్న ఆశవర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, ప్రమాదబీమా, రిటైర్మెంట్ ప్రయోజనాలు వర్తింపజేయాలని కోరారు. 32 రకాల రిజిస్టర్స్ ప్రింట్ చేసి ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఐదు రకాల యూనిఫాంలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వరూప, నవీన, భారతి, అమృత, సుజాత, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ స్పోర్ట్స్ పాఠశాలల్లో ఈ నెల 27న అండర్ –14, 17 కేటగిరీలో జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. అండర్ –14 కేటగిరీలో పాల్గొనే వారు 2010 జనవరి 1 తర్వాత, అండర్– 17 పోటీల్లో పాల్గొనే వారు 2007 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలని పేర్కొన్నారు. బోనఫైడ్, ఆధార్ కార్డుతో తెలంగాణ మోడల్ స్కూల్‌కు రావాలని సూచించారు. వివరాలకు 94400 10453 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అలాగే కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ స్కూల్‌లో త్రోబాల్, స్కేటింగ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

29న డివిజన్ స్థాయి ఎంపిక పోటీలు

జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 29న వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్ అండర్ 14, 17 కేటగిరీల్లో డివిజన్‌స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి, డీఎస్‌వో మీనారెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన వారు జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ, ఆశవర్కర్లను పర్మినెంట్ చేస్తాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జూర్(సిర్పూర్): అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ, ఆశ వర్కర్లను పర్మినెంట్ చేస్తామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లకు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యాలయానికి రాకుండానే నెలకు రూ.3,36,000 జీతం తీసుకుంటున్నారని, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు మాత్రం కనీస వేతనం చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు పింఛన్ అందజేయాలని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే సీఎం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆత్రం సాయి, మహిళా అధ్యక్షురాలు ఎనుక అమృత, మాజీ సర్పంచ్ ఎల్కరి రమేశ్, మాజీ ఎంపీటీసీ సారయ్య, రాజలింగు, సూర్ల ఇస్తారి, పోచం, సల్మాన్, రాకేశ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిక

చింతలమానెపల్లి(సిర్పూర్): మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డోకె రాజన్న, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు రామగోని నీలాగౌడ్ బీఎస్పీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌: గ్రీవెన్స్ దృష్టికి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కెరమెరి మండలం ఇందాపూర్ గ్రామ పంచాయతీలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణంలో సర్పంచ్ భర్త అవినీతికి పాల్పడినట్లు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని జిల్లా కేంద్రానికి చెందిన అతీక్ అహ్మద్ విన్నవించాడు. లోకో మోటర్ డిసెబులిటీ ఉన్న తన కుమారుడికి సదరం సర్టిఫికెట్ ఇప్పించి, పింఛన్ మంజూరు చేయాలని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎద్దు రమేశ్ కోరాడు. రెబ్బెన మండలం రాజారాం శివారులోని భూమిని ధరణి నుంచి తొలగిస్తే తన పేరుతో మారుతుందని, తగిన చర్యలు తీసుకోవాలని కత్తెర సాల నారాయణ దరఖాస్తు చేసుకున్నాడు. వారసత్వంగా వచ్చిన భూమిని వేరే వ్యక్తి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, న్యాయం చేయాలని బెజ్జూర్ మండలం వారిగూడ గ్రామానికి చెందిన రెడ్డి శంకర్ అర్జీ సమర్పించాడు. తండ్రి పేరుతో ఉన్న భూమిని తన పేరుతో విరాసత్ చేయాలని బెజ్జూర్ మండలం ఊట్‌సారంగపల్లికి చెందిన ఆత్రం శ్యామ్‌రావు దరఖాస్తు చేసుకున్నాడు. వంజరి శివారులో తన పేరుతో ఉన్న పట్టా భూమికి పాస్‌బుక్ ఉందని, ఆన్‌లైన్‌లో మిస్సింగ్ అని చూపుతుందని, దీనిపై విచారణ చేపట్టాలని కొ్ట్రంగి పోశెట్టి దరఖాస్తు చేసుకున్నాడు. గృహలక్ష్మి పథకం కింద ఆర్థికసాయం అందించాలని బెజ్జూర్ మండలం ఊట్‌సారంగపల్లికి చెందిన గీతాంజలి దరఖాస్తు చేసుకుంది. కుమార్తె, అల్లుడు కోవిడ్‌తో మృతి చెందారని, వారి బిడ్డ పోషణ నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంకు చెందిన ఉపాసి నాగమణి వేడుకుంది. దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం సాలెగూడకు చెందిన దుర్గం తారాబాయి, బెజ్జూర్ మండలం ముంజంపల్లికి చెందిన సేదం నారాయణ వేర్వేరుగా అర్జీ సమర్పించారు. రైతు రుణమాఫీ పథకం వర్తింపజేయాలని ఆసిఫాబాద్ మండలం సాలెగూడకు చెందిన కోనరాంబాయి వేడుకుంది. వీరితో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పలువురు సమస్యలపై కలెక్టర్‌కు ఏకరువు పెట్టుకున్నారు.

ఆసరా పింఛన్ ఇప్పించాలి



ఐదేళ్ల క్రితం విద్యుత్ షాక్ తగిలి ఎడమ కాలు పనిచేయడం లేదు. కుటుంబ పోషణకు పనులు చేయడానికి ఇబ్బంది పడుతున్న. ఆసరా పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. ఇప్పటికైనా పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి. – సేదం నారాయణ, దివ్యాంగుడు, ముంజంపెల్లి, కాగజ్‌నగర్

ఉద్యోగావకాశం కల్పించాలి



ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ శివారులో సర్వే నం.87లోని 12 ఎకరాల పరంపోగు భూమిని 75 ఏళ్లుగా సాగు చేస్తున్నాం. మేము సాగు చేసుకుంటున్న భూమిలోనే ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మించారు. భూమి కోల్పోయిన మాకు కళాశాలలో ఉద్యోగం ఇస్తామని చెప్పారు. ఇప్పటివరకు కల్పించలేదు. భూమి కోల్పోయిన మాకు వైద్యకళాశాలలో ఉద్యోగావకాశం కల్పించాలి. – మాస్కరి జనార్దన్, హివ్రే సాయికుమార్, అంకుసాపూర్, ఆసిఫాబాద్

అనర్హులకు ‘గృహలక్ష్మి’ కేటాయించారు



కెరమెరి మండలం ఇందాపూర్‌లో ఐదుగురు అనర్హులకు గృహలక్ష్మి ఇళ్లు మంజూరు చేశారని గ్రామానికి చెందిన దుర్గం బుచ్చయ్య, శెండె తంబాజీ, దేవ్‌కతి పుండలీక్, దుర్గం బిక్కుతోపాటు పలువురు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ప్రమేయంతో అనర్హులకు గృహలక్ష్మి పథకం మంజూరు చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు



యూనియన్ బ్యాంక్‌లోని ఆధార్ కేంద్రం వద్ద క్యూలైన్

ఆసిఫాబాద్‌రూరల్‌: రేషన్ కార్డుకు ప్రభుత్వం ఈ–కేవైసీ తప్పనిసరి చేయడంతో ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం ప్రజలు పరుగులు తీస్తున్నారు. కెరమెరి, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ) ఆధార్‌సెంటర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అధికారులు వాటి పర్మిషన్ రద్దు చేశారు. ఆయా మండలాల నుంచి ప్రజలు జిల్లా కేంద్రంలోని ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. సోమవారం యూనియన్ బ్యాంకులోని కేంద్రం వద్ద ఇలా రద్దీ కనిపించింది. ఇదే అదనుగా అధార్ అప్‌డేట్‌కు కొందరు రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలని, ఇందు కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఎంఆర్సీ కార్యాలయంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ‘లర్నింగ్ ఏ వర్డ్ ఏ డే’ వందరోజుల ప్రణాళికను ఆశ్రమ పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలను నిర్ణీత సమయంలో వాట్సాప్ ద్వారా అందించాలని సూచించారు. విద్యార్థుల గైర్హాజరుపై దృష్టి సారించాలన్నారు. ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్‌వో మీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీలపై నిర్లక్ష్య ధోరణి’



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: అంగన్‌వాడీ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి త్రివేణి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 15వ రోజుకు చేరుకుంది. త్రివేణి మాట్లాడుతూ సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ ఉద్యోగులపై బెదిరింపులకు పాల్పడటం మానుకోవాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సమస్యలు పరిష్కరించకుండా, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని మంత్రి మాట్లాడటం బాధాకరమన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, నాయకులు వనిత, ధనలక్ష్మి, మంజుల, భార్గవి, రమ, పద్మ, లక్ష్మి, సునీత, సులోచన పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ

తాండూర్: మండలంలోని బస్టాండ్ ఏరియాకు చెందిన రిటైర్డు సింగరేణి కార్మికుడు తోకల చిన్నయ్య ద్విచక్ర వాహనం (టీవీఎస్ చాంప్) చోరీకి గురైంది. ఆదివారం రాత్రి తన ఇంటి ఎదుట నిలిపి ఉంచిన వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఆయన పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

మహిళ ఆత్మహత్య

సిర్పూర్(టి): ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కోట కళావతి (42) భర్త తొమ్మిదేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారింట్లో ఉంటోంది. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురైంది. సోమవారం ఇంట్లోని దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో పిల్లలు అనాథలుగా మారారు. మృతురాలి కుమార్తె స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'పోడుభూములకు పట్టాలివ్వాలి'



వినతిపత్రం ఇస్తున్న రైతులు

బెల్లంపల్లిరూరల్: పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ పెర్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లంబాడి తండాకు చెందిన ఎస్టీ (లంబాడి) రైతులు సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఎర్రకుంట చెరువు సమీపంలోని అటవీ భూమిని సాగుచేసుకుంటున్నామన్నారు. ఇటీవల కేవలం ఐదుగురికి మాత్రమే పట్టాలు మంజూరయ్యాయన్నారు. తమ భూములను రీసర్వే చేసి పోడు పట్టాలు మంజూరు చేయాలని వేడుకున్నారు.

పెరిక సంఘం రాష్ట్ర కార్యవర్గంలో జిల్లావాసులు



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: పెరికసంఘం రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లాకు చెందిన మోటపలుకుల శ్రీనివాస్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంబడి అంజన్న, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ముత్యం వెంకటస్వామిని ఎన్నుకున్నారు.

డ్రైవర్‌కు ఏడాది జైలు

శ్రీరాంపూర్: కార్మికుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు మంచిర్యాల జిల్లా ఫస్ట్‌క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఎస్సై రాజేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15, 2019న ములుగు వెంకట్రాజం అనే కార్మికుడు బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ముందు నుంచి వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో లారీకి ఢీకొన్ని మృతి చెందాడు. డ్రైవర్ గందం భీమలింగుకు జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

రాజకీయాల్లో ఆదర్శం.. ఆర్థికంగా అథమం!

- దుర్భర జీవనం సాగిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కుటుంబం
- ఇందిరమ్మ ఇల్లే ఆవాసం.. కరెంటు లేని దైన్యం
- రేషన్ బియ్యమే జీవనాధారం



చంద్రశేఖర్ ఫొటోలతో భార్య, కుమారులు



అసంపూర్తిగా చంద్రశేఖర్ ఇల్లు

బెల్లంపల్లి:ఒక్కసారి ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే చాలు ఒక తరం కూర్చుని తిన్నా తరగని ఆస్తిపాస్తులు కూడబెట్టుకుంటున్నారు నేటితరం నేతలు. కానీ అందుకు భిన్నంగా బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ కుటుంబం దినదిన గండంగా బతుకీడుస్తోంది. సింగరేణి ఉద్యోగంతో వచ్చిన డబ్బుతో కట్టుకున్న ఇల్లు తప్ప మరే ఆధారం లేకుండా పోయింది. బెల్లంపల్లి మున్సిపాలిటీ ప్రథమ చైర్మన్, సింగరేణి రిటైర్డు సీనియర్ మైనింగ్ సర్దార్ ఇడిగిరాల చంద్రశేఖర్ కుటుంబం అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో జీవనం సాగిస్తోంది.

1987లో చైర్మన్‌గా ఎన్నిక..

ఇడిగిరాల చంద్రశేఖర్ 1983లో టీడీపీ తరఫున ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా పోటీచేసి సీపీఐ అభ్యర్థి దివంగత గుండా మల్లేశ్ చేతిలో 326 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. కార్మిక క్షేత్రమైన బెల్లంపల్లి పట్టణం 1987లో ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా ఏర్పడింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో చంద్రశేఖర్ తొలి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికై రికార్డు సృష్టించారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా 1992 వరకు పదవిలో కొనసాగారు. సింగరేణి కంపెనీలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వర్తించి 2006లో ఉద్యోగ విరమణ పొందారు. అంతకుముందే పెద్ద కుమారుడు, కూతురు పెళ్లిళ్లు చేశాడు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం సీఎంపీఎఫ్ రుణం తీసుకున్నాడు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగా కష్టార్జితం రూ.5.50 లక్షలు వెచ్చించి నిర్మించుకున్నాడు. సరిపడా ఆర్థిక వనరులు లేక ఇల్లు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉంది. చేతిలో డబ్బులు లేక కుటుంబ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. వృద్ధాప్యంలో అనారోగ్యానికి గురికావడంతో చికిత్స చేయించుకునేందుకు డబ్బులు లేని పరిస్థితిలో 2013 అక్టోబర్ 12న చంద్రశేఖర్ మృతి చెందాడు.

ఆర్థికసాయం అందించి ఆదుకోవాలి



మా కుటుంబ పరిస్థితులు బాగాలేవు. పూట గడవడం కష్టంగా ఉంది. ఆయన చనిపోక ముందు నుండే ఆర్థిక పరిస్థితులు పూర్తిగా దిగజారి పోయాయి. నీతి, నిజాయతీగా ఉండి ఏమీ కూడ బెట్టలేదు. కనీసం సొంత ఇంటి జాగ కూడా సంపాదించలేదు. నా పుట్టింటి వాళ్ల స్థలంలోనే ఇల్లు కట్టాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో దాతల సాయం కోరడం తప్పా మరేం చేయలేకుండా ఉన్నాం. దయామయులు కరుణించి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాం.

– ఇడిగిరాల కళావతి

ఆర్థిక కష్టాలు

చంద్రశేఖర్‌కు భార్య కళావతి, కుమారులు శ్రీనివాస్, దశరథం, కుమార్తెలు క్రాంతికుమారి, హారతి ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు దశరథం, కూతురు క్రాంతికుమారి పెళ్లిళ్లు కాగా.. మిగతా ఇద్దరు ఆర్థిక సమస్యల కారణంగా పెళ్లికి దూరమయ్యారు. శ్రీనివాస్ హైదరాబాద్‌లోని జూలాజికల్ పార్కులో చిరుద్యోగం చేసేవాడు. భార్యాభర్తల మధ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పక్షవాతానికి గురికావడంతో ఉద్యోగానికి దూరమయ్యాడు. కళావతికి తెల్ల రేషన్‌కార్డు ఉండగా ప్రతీనెల వచ్చే 18 కిలోల బియ్యంతో కాలం వెళ్లదీస్తున్నారు. ఆర్థికంగా చితికిపోయి కరెంటు బిల్లు కట్టకపోవడంతో రూ.18వేలకు చేరింది. దీంతో విద్యుత్ కనెక్షన్ తొలగించారు. దీంతో ఆ కుటుంబం నూనె దీపాలతో చీకట్లోనే మగ్గుతోంది. కనీసం ఇంటి మరుగుదొడ్డికి తలుపు కూడా లేకపోవడంతో వస్త్రాన్ని అడ్డంగా కట్టి అవసరాలు తీర్చుకుంటున్నారు. దయామయులు కరుణించి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది.

ఆదాయపు పన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

జైపూర్(చెన్నూర్): సింగరేణి కార్మికుల ఆదాయపుపన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఇందారం ఐకే1ఏ గనిపై సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఏటా వేల కోట్ల రూపాయల పన్నుల రూపేనా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తోందని, వాటినుంచి కార్మికులకు ఆదాయపుపన్ను మినహాయింపు ఇవ్వాలన్నారు. సమావేశంలో బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం

పాతమంచిర్యాల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా 'మేరామిట్టి మేరాదేశ్' క్యాంపెయిన్ నిర్వహించాలని భారత తపాలా శాఖ నిర్ణయించిందని జిల్లా పోస్టల్ అధికారి రామారావు తెలిపారు. ఇందులో భాగంగా స్వాతంత్య్ర సమరయోధులు పుట్టిన గడ్డనుంచి మట్టిని సేకరించి వారిని ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వాతంత్య్ర సమరయోధులు తమ సమీపంలోని పోస్టాఫీస్‌లలో సంప్రదించి వివరాలు అందించాలన్నారు. 9347081345, 9701167239 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మ్యాన్‌వైండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

బెల్లంపల్లి: మ్యాన్ వైండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని శాంతిఖని గనిని సందర్శించారు. షాఫ్ట్ ద్వారా భూగర్భ గనిలోకి ప్రవేశించి బోల్టర్ మైనర్ యంత్రాన్ని పరిశీలించి ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమన్వయంతోనే ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి ఆర్.విజయ్ ప్రసాద్, గ్రూప్ ఇంజనీర్ బసవరాజు, మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, రక్షణాధికారి రాజు, పిట్ ఇంజనీర్ రాంబాబు, సర్వే అధికారి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చెన్నూర్: జిల్లాస్థాయి పోటీలలో చెన్నూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాలలో గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. ఈ నెల 23న లక్సెట్టిపేటలో అండర్–17 విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. వాలీబాల్ పోటీలలో ప్రథమ, కబడ్డీ పోటీలలో ద్వితీయ, పరుగుపందెం పోటీలలో డి.రాహుల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందినట్లు తెలిపారు. సోమవారం విజేతలను ఏటీపీ కృపాసాగర్, ఉపాధ్యాయులు, నాగజ్యోతి, సీహెచ్ అశోక్‌కుమార్, పి.నరేశ్, పీఈటీ విజయ్‌కుమార్ అభినందించారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనులనుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ అర్జీలను ఆయాశాఖల అధికారులు పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంహెచ్ఓ కుడ్మ బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌సీఓ గంగాధర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు తదితరులు పాల్గొన్నారు.

- తనకు అటవీ హక్కు పత్రం మంజూరు చేయాలని బజార్‌హత్నూర్ మండలం మోహది గ్రామానికి చెందిన విజయ అర్జీ అందించింది.
- పాడి పరిశ్రమకు రుణం మంజూరు చేయాలని ఇంద్రవెల్లి మండలం జాలంతండా గ్రామానికి చెందిన కుంరం చిన్నుబాయి విన్నవించాడు.
- సిర్పూర్(యూ) మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమకు స్వయం ఉపాధికి రుణాలు ఇప్పించాలని అర్జీలు అందజేశారు.
- తన వైద్య చికిత్సకు ఆర్థికసాయం అందించాలని ఉట్నూర్ మండలం హీరాపూర్ గ్రామానికి చెందిన చిత్రం గిరిజాబాయి విన్నవించింది.

'ఇంటిరుణాల వడ్డీరేటు సవరించాలి'



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు తీసుకున్న రూ.10 లక్షల ఇంటి రుణాలపై కంపెనీ రీయింబర్స్‌మెంట్ చేసే వడ్డీ రేటు సవరించాలని కోరుతూ సోమవారం ఏఐటీయూసీ నాయకులు జీఎం బీ.సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు ముస్కె సమ్మయ్య, ఎస్కే బాజీ సైదా మాట్లాడుతూ కార్మికులు బ్యాంకుల నుంచి తీసుకునే ఇంటిరుణానికి కంపెనీ ఆర్బీఐ నిర్దేశించినట్లుగా కాకుండా కంపెనీ తక్కువగా చెల్లిస్తుందన్నారు. రూ.10 లక్షలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు మాత్రమే చెల్లిస్తుందన్నారు. ఎలాంటి పరిమితి లేకుండా బ్యాంక్ వడ్డీ ప్రకారం ఏడాదికి రూ.85 వేలు చెల్లించాల్సి ఉండగా తక్కువగా చెల్లించడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే ఈ వ్యత్యాసాన్ని సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్రి బుచ్చయ్య, నల్లపు సత్తయ్య పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో వైద్యం అందించాలని వినతి



ఆస్పత్రి వద్ద సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఎయిమ్స్ (ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) ఆస్పత్రిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి వైద్యసౌకర్యం కల్పించాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుమాధవ్ ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఉన్న ఎయిమ్స్ ఆస్పత్రిలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్, మల్కాజిగిరి, యాదాద్రి, తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు పదివేల మంది సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారన్నారు. వీరికి సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు ద్వారా వైద్య సౌకర్యం ఉందని, ఆస్పత్రిలో తమకు వైద్యసేవలు అందించాలని కోరారు. బాలయ్య, పార్థసారథి, మధునయ్య, లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నరేందర్



నియామకపత్రం అందిస్తున్న సంజీవరెడ్డి

మంచిర్యాలటౌన్: ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన రాంశెట్టి నరేందర్ నియామకమయ్యారు. ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి చేతుల మీదుగా సోమవారం హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి బి.జనక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో టీబీజీకేఎస్ విఫలం'



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

మందమర్రిరూరల్: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ విఫలమైందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేజ్‌బోర్డ్ బకాయిల చెల్లింపు విషయంలో ఏఐటీయూసీ కీలకపాత్ర పోషించిందన్నారు. ఇప్పించిన బకాయిల్లో సింగరేణి సగం కోత రూపంలో లాక్కుంటే టీబీజీకేఎస్ మిన్నకుండి పోయిందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, రాజేశం, సంపత్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

'గనులపై సేఫ్ లాకర్లు ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న భాగ్యరాజ్

శ్రీరాంపూర్: విధులకు వచ్చిన కార్మికులు తమ సామగ్రి భద్రపర్చుకునేందుకు గనులపై సేఫ్ లాకర్లు ఏర్పాటు చేయాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి గోదారి భాగ్యరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల రెస్ట్ రూంలో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయన్నారు. క్యాంటీన్లు కూడా అధ్వానంగా మారాయని, సరైన ఆహారం దొరకడం లేదన్నారు. కోలిండియాలో మాదిరి పెర్క్స్‌పై ఐటీని రీయింబర్స్‌మెంట్ చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు బాలాజీ, ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ శ్రీనివాస్, గుండేటి అజయ్, తోడే సుధాకర్, శ్రీధర్, మేడిపల్లి శ్రీనివాస్, ఆవునూరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్ అండర్–15 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30 నుంచి అక్టోబర్ 2 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో షార్ప్‌స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు, హెచ్ఎం సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, జిల్లా నెట్‌బాల్ ప్రధాన కార్యదర్శి తిరుపతి సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

బాలుర జట్టుకు సీహెచ్ వరణ్‌కుమార్, సీహెచ్ గోపాలశ్రీకృష్ణ, డి.ప్రేందీప్, డి.సిద్ధార్థ, సీహెచ్.నిఖిల్, కే.సాయిప్రసాద్, టి.రుద్రధృవన్, ఎస్.సాయిప్రణయ్, జోయెల్, కే.నాగఈశ్వర్, స్టాండ్ బై క్రీడాకారులుగా హర్షిద్, ఎస్‌కే అయాన్, కోచ్‌గా మల్లేశ్, మేనేజర్‌గా కే.భాస్కర్, బాలికల జట్టులో శ్రీస్ఫూర్తి కారుణ్య, కే. హరిణి, టి.ప్రజ్వలశ్రీ, సాయిశ్రీవర్షిణి, దివ్యజ్యోతి, పి.శ్రావ్య, అభిగ్నయ, టి.అర్చన, డి.వేరోనిక, ప్రతిభా బిస్వాస్, స్టాండ్ క్రీడాకారులుగా ఎస్.సంజన, సాయిశివ మల్లికా, కోచ్‌గా తిరుపతి, మేనేజర్‌గా ఎం.వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు.

'సింగరేణిలో ప్రైవేటీకరణను అడ్డుకోవాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో నానాటికీ పెరుగుతున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణను అడ్డుకోవాలని బీఎంఎస్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆర్కే 5 గనిపై ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఇప్పటికే చాలా డిపార్టుమెంట్లు ప్రైవేటుపరం అయ్యాయని, చివరికి పర్మినెంట్ కార్మికులు పనిచేసే విభాగాల్లో కూడా కాంట్రాక్టు కార్మికులను పనులకు పురమాయిస్తున్నారన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ హయాంలో కార్మికుల అనేక హక్కులు హరించబడ్డాయన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలన్నా, హక్కులు రక్షించబడాలన్నా, కొత్త హక్కులు సాధించుకోవాలన్నా బీఎంఎస్‌తోనే సాధ్యమన్నారు. నాయకులు వినోద్ కుమార్, పంచర్ల నరేష్, రామకృష్ణ, రాకేష్, జాడీ ఈశ్వర్ రాజేందర్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

'చితి'కి పోతున్న 'కౌలు'



ఈ చిత్రంలో ఇద్దరు పిల్లలతో కలిసి భర్త ఫొటో చూపుతున్న ఈమె పేరు జాదవ్ అనిత. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం పట్‌పట్ తండాకు చెందిన కౌలు రైతు జాదవ్ తుకారాం భార్య. తుకారాం గతేడాది ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, సోయా సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పు తీర్చలేక పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో భార్య, ఇద్దరు చిన్నారులు రోడ్డున పడ్డారు. ఇదొక్కటే కాదు.. జిల్లాలో ఇలాంటి బాధిత కుటుంబాలు అనేకం ఉన్నాయి.

- సాగు పెట్టుబడికి ప్రైవేట్ అప్పులే దిక్కు
- రైతును ఏటా వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు
- దిగుబడి రాక.. అప్పు తీర్చలేక..
- మ'రుణ' శాసనం లిఖిస్తున్నారు..

ఉమ్మడి జిల్లాలో కౌలు రైతుల వివరాలు

జిల్లా	కౌలురైతులు
ఆదిలాబాద్	28,763
నిర్మల్	33,212
కుమురంభీం	26,754
మంచిర్యాల	28,584

ఇచ్చోడ(బోథ్): సాగు కలిసిరాక కౌలు రైతు బలిపీఠం ఎక్కుతున్నాడు. పంట రుణాలతో పాటు సంక్షేమ పథకాలు అందకపోవడం.. మరోవైపు వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలతో సాగుకు చేసిన అప్పు తీర్చే దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బాధిత కుటుంబాలకు పుట్టెడు దుఃఖం మిగుల్చుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ కారణాలతో తనువు చాలించిన అన్నదాతల్లో కౌలు రైతులే అధికం. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,17,268 మంది కౌలు రైతులు ఉన్నారు. ఇందులో గడిచిన మూడేళ్లలో 65 మంది బలవన్మరణాలకు పాల్పడడం గమనార్హం.

ప్రైవేట్ అప్పులే దిక్కు

కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం, బ్యాంకులు సైతం రుణాలు ఇవ్వక పోవడంతో గత్యంతరం లేక ప్రైవేట్ అప్పులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. మరోవైపు నకిలీ విత్తనాలు మొలకెత్తకపోవడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో పెట్టుబడి పెరిగి, దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో అందక కౌలు సైతం చెల్లించలేని పరిస్థితి తలెత్తుతోంది. అప్పు తీర్చే దారి లేక తీవ్ర ఒత్తిడికి గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

అతివృష్టి, అనావృష్టితో...

భూమి కౌలుకు తీసుకున్నప్పటి నుంచి సాగుకు పెట్టుబడి పెట్టాల్సిందే. రెండు, మూడేళ్ల క్రితం ఎకరాకు రూ.5వేలు ఉన్న కౌలు ప్రస్తుతం రూ.10 వేలు దాటింది. పెరిగిన పెట్టుబడితో పాటు అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఈక్రమంలో మరోసారి అప్పు చేసి కౌలు చెల్లించాల్సిన దుస్థితి. ఇలా అప్పుల ఊబిలో చిక్కుకున్న కౌలురైతు చివరకు తనువు చాలిస్తున్నాడు. బాధిత కుటుంబానికి తీరని శోకం మిగుల్చుతున్నాడు.

ఉమ్మడి జిల్లాలో కౌలు రైతుల మరణాలు

జిల్లా	2020	2021	2022	2023	మొత్తం
ఆదిలాబాద్	09	13	10	02	34
నిర్మల్	02	04	08	03	17
మంచిర్యాల	03	02	02	01	08
కుమురంభీం	02	01	02	01	07
మొత్తం	16	20	22	07	65

పథకాలు అమలు చేయాలి



సాగుకు చేసిన అప్పు తీర్చే దారి లేక కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రైతు ఆత్మహత్యలను అరికట్టాలంటే ప్రభుత్వం వీరికి వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేయాలి. అలాగే బాధిత కుటుంబాలను సైతం ఆదుకోవాలి.

– సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు